# "మహిమలోనికి చేర్చుకొనబడెను"[1]

## మార్కు 16:19; లూకా 24:50-53; అపొ. 1:9-12, పరిశీలన

క్రీస్తు జీవితంలోని సహజమైన ముగింపుకు వచ్చి చేరుకున్నాం: అది ఆయన ఆరోహణం. శిష్యులతో తన కడసారి మాటలయందు, ఆయన శ్రమవెంట మహిమ వస్తుందని సూచించారు – ఆయన ఆరోహణమైనప్పుడు అది జరిగింది: "క్రీస్తు ఈలాగు శ్రమపడి తన మహిమలో ప్రవేశించుట అగత్యము కాదా?" (లూకా 24:26). దేవుడు తన "బలాతిశయము చేత క్రీస్తును మృతులలోనుండి లేపి, ... ఎంతో హెచ్చుగా పరలోకమందు ఆయన తన కుడిపార్శ్వమున కూర్చుండపెట్టుకొని యున్నాడు" అని పౌలు తెలియజేశాడు (ఎఫెసీ. 1:20).

క్రీస్తు భూనివాసకాలానికి ఆరోహణము సహజమైన ముగింపు ఎందుకంటే, ఆయన పరలోకమునుండి వచ్చినందున ఆయన తిరిగి వెళ్లడం తగినదైయున్నట్టు గోచరిస్తుంది. అది సహజమైన ముగింపు ఎందుకంటే, "మనము మన స్వరూపమందు ... నరులను చేయుదము" అని ఆయన అన్నప్పుడు దేవుని భావమేమో క్రీస్తు జీవితం ప్రదర్శించింది (ఆది. 1:26ఎ). అది వాస్తవమైయుండగా, నరుడు ఒకప్పుడు ఏదెను తోటలో దేవునితో అనుభవించిన సంపూర్ణ సహవాసమునకు క్రీస్తు తిరిగి వెళ్లడం అర్థసహితమైయుంటుంది.

ఆరోహణమును గూర్చి బైబిలు ఏమి ఉపదేశిస్తుందో దాన్ని గూర్చి చదువుచుండగా, దాన్ని మనం సంపూర్ణంగా గ్రహించలేమనే వాస్తవాన్ని అంగీకరించాలి. ఉదాహరణకు, ("మాంసము ఎముకలతో"[2] ఉన్న) క్రీస్తు పునరుత్థాన శరీరం పరలోకంలోనికి ప్రవేశించాలంటే మరో విధంగా రూపాంతరం చెందాలి? దీనికి గాని ఈ సందర్భంగా వచ్చే మరి ఏ ప్రశ్నకు గాని క్రొత్త నిబంధన బదులివ్వలేదు. ఆరోహణాన్ని లేఖనాలు వర్ణించాయే గాని, దాన్ని వివరించడానికి ఏ ప్రయత్నమూ చేయలేదు. అసలైన సంఘటనను మూడు లేఖన భాగాలు సూచించాయి:

> ఆయన బేతనియవరకు వారిని తీసికొనిపోయి చేతులెత్తి వారిని ఆశీర్వదించెను. వారిని ఆశీర్వదించుచుండగా ఆయన వారిలోనుండి ప్రత్యేకింపబడి పరలోకమునకు ఆరోహణుడాయెను. వారు ఆయనకు నమస్కారము చేసి మహా ఆనందముతో యెరూషలేమునకు తిరిగి వెళ్లి(రి) (లూకా 24:50–52).

> ఈ మాటలు చెప్పి, వారు చూచుచుండగా ఆయన ఆరోహణమాయెను, అప్పుడు వారి కన్నులకు కనబడకుండ ఒక మేఘము ఆయనను కొనిపోయెను. ఆయన వెళ్లుచుండగా, వారు ఆకాశమువైపు తేరి చూచుచుండిరి. ఇదిగో తెల్లని వస్త్రములు ధరించుకొనిన యిద్దరు మనుష్యులు వారియొద్ద నిలిచి – గలిలయ మనుష్యులారా,

మీరెందుకు నిలిచి ఆకాశమువైపు చూచుచున్నారు? మీయొద్దనుండి పరలోకమునకు చేర్చుకొనబడిన యీ యేసే, ఏ రీతిగా పరలోకమునకు వెళ్లుట మీరు చూచితిరో ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చునని వారితో చెప్పిరి (అపొ. 1:9-11).

అప్పుడు వారు ఒలీవల వనమనబడిన కొండనుండి యెరూషలేమునకు తిరిగి వెళ్లిరి. ఆ కొండ యెరూషలేమునకు విశ్రాంతి దినమున నడువదగినంత సమీపమున ఉన్నది (అపొ. 1:12).

ఈలాగు ప్రభువైన యేసు వారితో మాటలాడిన తరువాత పరలోకమునకు చేర్చుకొనబడి, దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడయ్యెను (మార్కు 16:19).

క్లుప్తమైన ఈ వర్ణనలతో పాటు – ప్రత్యక్షము లేక పరోక్షమైన – పలు రిఫరెన్సులు క్రొత్తనిబంధనలో ఈ సంభవాన్ని సూచిస్తున్నాయి. ఇక్కడ కొన్నింటిని చూద్దాం:

- తొలి సువార్త ప్రసంగంలో, క్రీస్తు "దేవుని కుడిపార్శ్వమునకు హెచ్చింపబడి" నట్టు పేతురు తెలిపాడు (అపొ. 2:33).
- తన రెండవ ప్రసంగంలో, క్రీస్తును గూర్చి మాట్లాడుతూ, "అన్నిటికి కుదురుబాటు కాలము వచ్చువరకు యేసు పరలోక నివాసియైయుండుట అవశ్యకము"[3] అని పేతురు పేర్కొన్నాడు (అపొ. 3:21).
- పిసిదియలోని అంతియొకయలో సమాజమందిరమందు పౌలు ప్రసంగిస్తూ "ఇక కుళ్లు పట్టకుండ ఆయనను మృతులలోనుండి లేపుటను బట్టి" అని సూచించాడు (అపొ. 13:34).
- ఎఫెసులోని సంఘానికి పౌలు పత్రికను వ్రాస్తూ, ఆరోహణం మీద ఈ విస్తరించిన గమనికను చేర్చాడు: "అందుచేత ఆయన ఆరోహణమైనప్పుడు, చెరను చెరగా పట్టుకొని పోయి,[4] మనుష్యులకు ఈవులను అనుగ్రహించెనని చెప్పబడియున్నది.[5] ఆరోహణమాయెననగా ఆయన భూమియొక్క క్రింది భాగములకు దిగెననియు అర్థమిచ్చుచున్నది గదా?[6] దిగినవాడు తానే సమస్తమును నింపునట్లు ఆకాశమండలము లన్నిటికంటె మరి పైకి ఆరోహణమైన వాడునైయున్నాడు" (ఎఫెసీ. 4:8-10).
- ప్రకటన 12వ అధ్యాయంలో, స్త్రీయొక్క ఎఱ్ఱని మహా ఘటసర్పము యొక్కయు దర్శనముంది. వచనం 5లో, క్రీస్తు జననానికి, తరువాత ఆయన ఆరోహణానికి సంబంధించిన రిఫరెన్సు ఉంది: "సమస్త జనములను ఇనుపదండముతో;[7] ఏలనైయున్న యొక మగ శిశువును ఆమె కనగా. ఆమె శిశువు దేవుని యొద్దకును ఆయన సింహాసనమునొద్దకును కొనిపోబడెను."

ఆరోహణము రెండు గొప్ప కార్యాలను పూర్తిచేసింది: గతాన్ని అది శిఖరాగ్రానికి ఎక్కించింది, భవిష్యత్తు కొరకు మార్గాన్ని సిద్ధపరచింది. దీన్ని మరోవిధంగా చెప్పాలంటే,

క్రీస్తు భూ పరిచర్యకు ఉచ్చ స్థితి గాను, తరువాత అంచెలో, తన శిష్యుల పరిచర్యకు మార్గము సిద్ధపరచునదిగాను ఉంది. ఆరోహణం లేకుండ, క్రీస్తు పునరుత్థానానికిని, దాదాపు 50 దినాల తరువాత పెంతెకొస్తు దినాన ఆత్మ రాకడకును మధ్య లింకు లేకుండా పోయేదే.[8] క్రీస్తు భూనివాసకాల పరిచర్యకును, దాని వెంటవచ్చిన ఆయన అపొస్తలుల పరిచర్యకును మధ్య నిశ్చయంగా విభజించదగిన పాయింటు ఆరోహణం.

## క్రీస్తు మహిమపరచబడుట

క్రీస్తు మహిమలోనికి చేర్చుకొనబడడంతో ఆరోహణము శిఖరాగ్రాన్ని చేరుకుంది. "క్రీస్తు ... తన మహిమలో ప్రవేశించుట అగత్యము" (లూకా 24:26). ఆరోహణుడైన క్రీస్తు "తేజోమయుడై" నట్టు పౌలు రాశాడు (1 తిమోతి. 3:16). దేవుడు ఆయనకు "మహిమ నిచ్చిన"ట్టు పేతురు తెలిపాడు (1 పేతురు 1:21).

ఆరోహణము క్రీస్తు ప్రభువు పనిలో ఉన్నతమైన విషయంగా తొలిగా అనిపించడం ఆశ్చర్యంగా ఉంటుంది. దీనిని గూర్చి కొంచెం ఆలోచించు. ఏది ఎక్కువగా ఉత్కంఠను కలుగజేస్తుంది: నిర్ణీతమైన షరత్తులను నెరవేర్చడమా లేక ఆ షరత్తులను దేని నిమిత్తము చేసావో దాన్ని సాధించడమా?[9] ఈ సమయంవరకు మన రక్షకుడు ప్రధానయాజకుడుగాను రాజుగాను ఉండే తన పనికొరకు తన్ను తాను సిద్ధపరచుకొన్నారు. ఆ సిద్ధపాటుకు ఆరోహణం కిరీటం ధరింపజేసింది. Philip Yancey యిలా రాశాడు,

> శిష్యుల జీవితాలకు (పునరుత్థానపు) ఆదివారం బహుగా ఉద్రేకింపజేయు దినమైయున్న యెడల, ప్రభువైన యేసుకు అది ఆరోహణ దినమైయుండవచ్చు. సృష్టికర్తయైన ఆయన ఎంతగా దిగివచ్చి ఎంతగా అప్పగించుకున్నారో, యిప్పుడు అంతగా పైకి ఎగయు చున్నారు. దీర్ఘమైన రక్తమయమైన యుద్ధ భూమినుండి సముద్రాన్ని దాటి తిరిగి వస్తున్న సైనికునివలె తన రోదసి దుస్తులను విప్పివేసి రోదసి యాత్రికుడు భూమియొక్క ఎరుకైన వాతావరణంలో ప్రవేశించునట్లు.[10] కడకు యింటికి చేరుకున్నాడు.[11]

### మహిమపరచబడెను

క్రీస్తు తిరిగి తన పరలోకమునకు చేరుకున్నప్పుడు, ఎలాగుండిందో ఊహించు. పరలోకపు సౌభాగ్యంలో ఉత్సాహ గానాలు ప్రతిధ్వనించడాన్ని నీ మనో భావాలలో వినగలుగుతున్నావా?

గొప్ప రాజు యింటికి తిరిగి వచ్చునప్పుడు (కీర్తన. 24) పాడే విజయ గీతమైయుంది. ప్రభువు పరలోకానికి తిరిగి వచ్చినప్పటి సందర్భానికి దీన్ని వర్తింపజేయవచ్చునని ఒక వ్యక్తి అభిప్రాయపడ్డాడు. ఈ లేఖన భాగాన్ని ఉపయోగించి, క్రీస్తు ఆరోహణమైనప్పుడు ఎలా ఉండిందో యోచించు.

ఆయన ఆరోహణమవ్వగా, దేవదూతలు ఆయనను ఎదుర్కొని, వెంటనుండి ఆయనను తోడుకొనిపోయారు. పరలోక పట్టణాన్ని వారు సమీపించగా, "గుమ్మములారా,

మీ తలలు పైకెత్తికొనుడి మహిమగల రాజు ప్రవేశించునట్లు పురాతనమైన తలుపులారా, మిమ్మును లేవనెత్తికొనుడి" అని కేకలు వేశారట (7 వ.). అప్పుడు పట్టణంలో ఉన్నవారు, "మహిమగల యీ రాజు ఎవడు?" అని అడిగితే (8ఎ వ.), క్రీస్తుతో కూడ ఉన్న దేవదూతలు, "బలశౌర్యములుగల యెహోవా యుద్ధశూరుడైన యెహోవా" అని ప్రత్యుత్తర మిచ్చారట (8బి వ.). అప్పుడు మరల, "గుమ్మములారా, మీతలలు పైకెత్తికొనుడి, పురాతనమైన తలుపులారా, మహిమగల రాజు ప్రవేశించునట్లు మిమ్మును లేవనెత్తికొనుడి" (9 వ.) అని అరిచారట. మరోసారి, పట్టణంలో ఉన్నవారు, "మహిమగల యీ రాజు ఎవడు?" అని అడిగారట (10ఎ వ.). ఈసారి, క్రీస్తుతో కూడ ఉన్నవారు, "సైన్యముల కధిపతియగు యెహోవాయే" (10బి వ.). "ఆయనే యీ మహిమగల రాజు" అని గీతం పాడారట (10బి వ.).

యేసు పరలోకపు గుమ్మములలోనికి ప్రవేశించినప్పుడు, "లోకము పుట్టక మునుపు" తండ్రియైన దేవునియొద్ద తనకు ఏ మహిమయుండెనో (యోహాను 17:5) ఆ మహిమను తిరిగి ఆయన పొందియున్నాడు.

> అందుచేతను పరలోకమందున్న వారిలోగాని, భూమిమీద ఉన్నవారిలో గాని, భూమిక్రింద ఉన్నవారిలో గాని, ప్రతివాని మోకాలును యేసు నామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పైనామమును[12] ఆయనకు అనుగ్రహించెను (ఫిలిప్పీ. 2:9–11).

మానవ పాప పరిహారార్థమైన వధింపబడిన నిష్కళంకమైన గొఱ్ఱెపిల్లను పరలోక సైన్య సమూహము స్తుతింపసాగింది (1 పేతురు 1:18, 19 చూడు). యోహాను యిలా రాశాడు,

> మరియు నేను చూడగా సింహాసనమును, జీవులను, పెద్దలను ఆవరించియున్న అనేక దూతల స్వరము వినబడెను, వారి లెక్క కోట్లకొలదిగా ఉండెను. వారు – వధింపబడిన గొఱ్ఱె పిల్ల, శక్తియు ఐశ్వర్యమును, జ్ఞానమును, బలమును, ఘనతయు, మహిమయు స్తోత్రమును పొంద నర్హుడని గొప్ప స్వరముతో చెప్పుచుండిరి (ప్రకటన 5:11, 12).

అప్పుడు దేవుడు ఆయనను (క్రీస్తును) "తన కుడిపార్శ్వమున కూర్చుండబెట్టుకొని యున్నాడు" (ఎఫెసీ. 1:20).

### ప్రధాన యాజకుడుగా

క్రీస్తు ఆరోహణుడైనప్పుడు, ఆయన మన ప్రధాన యాజకుడుగా నియమించబడ్డాడు. "ఆకాశమండలముగుండ వెళ్లిన,[13] దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధాన యాజకుడు మనకు ఉన్నాడు" అని హెబ్రీ రచయిత అన్నాడు (హెబ్రీ. 4:14).

పాత నిబంధనలో – ప్రాయశ్చిత్త దినమున – సంవత్సరమునకు ఒక్కసారి –

అతిపరిశుద్ధ స్థలములో ప్రధాన యాజకుడు, తన పాపములకొరకును ప్రజల పాపములకొరకును జంతువుల రక్తముతో ప్రవేశిస్తాడు (లేవీ. 16:2–34 చూడు). మన ప్రధాన యాజకుడుగా, క్రీస్తు పరలోకములోనికి తిరిగి వెళ్లినప్పుడు, మన పాప ప్రాయశ్చిత్తము కొరకు తన స్వరక్తముతో ప్రవేశించారని చెప్పబడింది. దీని విషయమై, హెబ్రీయుల రచయిత యిలా అన్నాడు,

> అయితే క్రీస్తు రాబోవుచున్న మేలుల విషయమై ప్రధాన యాజకుడుగా వచ్చి, తానే నిత్యమైన విమోచన సంపాదించి ... మేకలయొక్కయు కోడెలయొక్కయు రక్తముతో కాక, తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను (9:11, 12).

> అందువలన నిజమైన పరిశుద్ధ స్థలమును పోలి హస్తకృతమైన పరిశుద్ధ స్థలములలో క్రీస్తు ప్రవేశింపలేదు గాని, యిప్పుడు మనకొరకు దేవుని సముఖమందు కనబడుటకు పరలోకమందే ప్రవేశించెను (9:24).

> ఈయనయైతే పాపముల నిమిత్తమై సదాకాలము నిలుచు ఒక్క బలిని అర్పించి ... దేవుని కుడిపార్శ్వమున ఆసీనుడాయెను (10:12).

క్రీస్తు ప్రధాన యాజకత్వంలోని మరో విశేషమైన సంగతి – ఆయన మనకు మధ్యవర్తిగా నిలిచియున్నారు: "దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తుయేసను నరుడు" (1 తిమోతి 2:5). ఈ ఏర్పాటులో ఒక అద్భుతమైన విషయమేమంటే – ప్రభువు యిందులో దయగల పాత్రను వహిస్తారు:

> మన ప్రధాన యాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడు గాని, సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను. గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయముకొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనమునొద్దకు చేరుదము (హెబ్రీ. 4:15, 16).

క్రీస్తు శరీరరూపంలో పరలోకానికి ఆరోహణమవ్వడానికి యిది ముఖ్యమైన కారణమై యుండవచ్చు. క్రీస్తుయేసునందు ఒక భాగం ఎల్లప్పుడు నరుడైయుంటుందని చెప్పబడింది. 1 తిమోతి 2:5లో, "నరుడు" అనే పదం గమనించు: "... దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే ఆయన క్రీస్తుయేసను నరుడు." మార్సు కొండమీద పౌలు తన ప్రసంగంలో యిలాటి పదాలనే ప్రయోగించాడు: అంతట అందరు మారుమనస్సు పొందాలని దేవుడు ఆజ్ఞాపించినట్టు తెలుపుతు, "ఎందుకనగా తాను నియమించిన మనుష్యునిచేత నీతిననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి యొక దినమును నిర్ణయించియున్నాడు. మృతులలోనుండి ఆయనను లేపినందున దీని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగజేసియున్నాడు" (అపో. 17:31). ప్రకటన 4, 5 అధ్యాయాలలోని సింహాసనపు దృశ్యంలో, (యేసు) "వధింపబడిన గొఱ్ఱెగా" సింహాసనము ఎదుట నిలిచినట్టున్నాడు (ప్రకటన 5:6) – దీన్ని బట్టి, ఏదో యొక విధంగా,

పరలోకమందు సయితం, ఆయన సిలువ మరణపు గురుతులు కలుగియున్నట్టు కొందరు అభిప్రాయపడ్డారు.[14]

క్రీస్తు ఆరోహణుడైన పిమ్మట, శరీరము ఎంతటి బలహీనమైనదో లేక భౌతికమైన దేహాల్లో మనం ఎంతగా పెనుగులాడుతూ ఉంటామో ఆయన మరచిపోలేదు. ప్రధాన యాజకుడుగా, ఆయన మనలను జ్ఞాపకం చేసికొంటారు, మనలను అర్థం చేసికొంటారు![15]

**రాజుగా**

క్రీస్తు నిజముగా మన ప్రధాన యాజకుడుగా నియమింపబడి, నిలచియున్నాడు. అయితే, ఆయన "మహిమపరచబడెను" అనే పదాన్ని విన్నప్పుడు, ఆయన రాజుగా పట్టాభిషేకం చేయబడిన వాస్తవాన్ని కూడ మనం ఆలోచిస్తాం. ముందుగా గుర్తించినట్టే, "యేసు ... పరలోకమునకు చేర్చుకొనబడి, దేవుని కుడిపార్శ్వమున ఆసీనుడయ్యెను" (మార్కు 16:19). నేడు క్రీస్తు దేవుని కుడిపార్శ్వమున ఆసీనుడైయున్నట్టు లేఖనాలు మాటిమాటికి ప్రకటిస్తున్నాయి. స్తెఫను మృతిచెందుచుండినప్పుడు, "... ఆకాశమువైపు తేరిచూచి, దేవుని మహిమను యేసు దేవుని కుడిపార్శ్వమందు నిలిచియుండుటను చూచి – ఆకాశము తెరువబడుటయు, మనుష్యకుమారుడు దేవుని కుడిపార్శ్వమందు నిలిచియుండుటయు చూచుచున్నాని చెప్పెను" (అపో. 7:55, 56).[16] "మీరు క్రీస్తుతో కూడ లేపబడినవారైతే పైనున్నవాటినే వెదకుడి, అక్కడ క్రీస్తు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండియున్నాడు" అని పౌలు క్రైస్తవులను హెచ్చరించాడు (కొలస్సీ. 3:1). "ఆయన పరలోకమునకు వెళ్లి దూతలమీదను అధికారులమీదను శక్తులమీదను అధికారము పొందినవాడై దేవుని కుడిపార్శ్వమున ఉన్నాడు" అని పేతురు రాశాడు (1 పేతురు 3:21, 22).

యేసు దేవుని కుడిపార్శ్వమున కూర్చున్నారనడానికి రుజువుగా, పేతురు పెంతెకొస్తు దినాన కలిగిన అద్భుతమైన దృశ్యాలను శబ్దాలను ఉపయోగించాడు. అందునుబట్టి ఆయన ప్రభువుగాను క్రీస్తుగాను నియమింపబడినట్టు అతడు తెలియజేశాడు:

> కాగా ఆయన దేవుని కుడి పార్శ్వమునకు హెచ్చింపబడి, పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానమును తండ్రివలన పొంది, మీరు చూచుచు వినుచున్న దీనిని కుమ్మరించి యున్నాడు.[17] దావీదు పరలోకమునకు ఎక్కిపోలేదు; అయితే అతడిట్లనెను – నేను నీ శత్రువులను నీ పాదముల క్రింద పాదపీఠముగా ఉంచువరకు నీవు నా కుడిపార్శ్వమున కూర్చుండుమని ప్రభువు నా ప్రభువుతో చెప్పెను. మీరు సిలువవేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెనని చెప్పెను (అపో. 2:33-36).

దేవుడు యేసును మృతులలోనుండి లేపెనని పౌలు యిలా రాశాడు ...

> ... ఆయన ఆ బాలాతిశయముచేత క్రీస్తును మృతులలోనుండి లేపి, సమస్తమైన ఆధిపత్యముకంటెను అధికారముకంటెను శక్తికంటెను ప్రభుత్వముకంటెను, ఈ యుగమందు మాత్రమే గాక రాబోవు యుగమునందును పేరు పొందిన ప్రతి నామము కంటెను,

ఎంతో హెచ్చుగా పరలోకమునందు ఆయనను తన కుడిపార్శ్వమున కూర్చుండ బెట్టుకొనియున్నాడు. మరియు సమస్తమును ఆయన పాదములక్రింద ఉంచి, సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను (ఎఫెసీ. 1:20-22).

తండ్రియైన దేవునితో సహ ఏలికగా ఉండునట్లు రాజుగా క్రీస్తు పట్టాభిషేకము చేయబడిన ఆ సందర్భం ఎంత అద్భుతమైనదై యుందో! ప్రవక్తయైన దానియేలు 7 యొక్క రాత్రి దర్శనము క్రీస్తువారి పట్టాభిషేక మహోత్సవముగా అనేకమంది భావిస్తారు:

రాత్రి కలిగిన దర్శనములను నేనింక చూచుచుండగా, ఆకాశమేఘారూఢుడై మనుష్యకుమారుని పోలిన యొకడు (క్రీస్తు) వచ్చి, ఆ మహావృద్ధుడగువాని (దేవుని) సన్నిధిని ప్రవేశించి, ఆయన సముఖమునకు తేబడెను. సకల జనులును రాష్ట్రములును ఆయాభాషలు మాటలాడువారును ఆయనను సేవించునట్లు ప్రభుత్వమును మహిమయు ఆధిపత్యమును ఆయనకీయబడెను. ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది అదెన్నటికిని తొలిగిపోదు; ఆయన రాజ్యము ఎప్పుడును లయముకాదు (దానియేలు 7:13, 14).[18]

ఆరోహణానికి కొంచెం ముందుగా, "పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది" అని ప్రభువు చెప్పుకున్నారు (మత్తయి 28:18). మనకు "ప్రభువు ఒక్కడే" ఆయన యేసు క్రీస్తు.[19] ఈ గొప్ప సత్యాన్ని ఆయన ఆరోహణం మనకు నిశ్చయపరచుతుంది (ఎఫెసీ. 4:5).

## శిష్యుల సిద్ధపాటు

తన భూనివాసకాలపు పరిచర్యకు సంబంధించి, ఆరోహణ దినం క్రీస్తుకు తప్పక బహుగా ఉల్లసించు దినమైయుండవచ్చునని ముందుగా సూచించాను. ఏదియేలాగున్నా ఆరోహణమనేది కేవలం ఆయన ప్రయోజనానికే కాదు; శిష్యులకు కూడ అది ప్రత్యేకమైన ప్రాధాన్యతకలదై ఉంది. గొప్ప వీడ్కోలు చర్చలో, "... నేను వెళ్లిపోవుట మీకు ప్రయోజన కరము" అని ఆయన వక్కాణించారు (యోహాను 16:7ఎ).

### బాధ్యత వేరొకరికి అప్పగించాడు

తాను వెళ్లుతున్నట్టున్నూ, తన స్థానంలో వారు కొనసాగింపవలసియున్నట్టున్నూ క్రీస్తు తన అపొస్తలులకు తెలియజేశారు. "తండ్రి నన్ను పంపిన ప్రకారము నేనును మిమ్మును పంపుచున్నాను అని కూడ ఆయన వారికి చెప్పారు" (యోహాను 20:21). "భూదిగంతముల వరకును నాకు సాక్షులైయుందురని వారికి సూచించారు" (అపొ. 1:8).

కొద్దిసేపు, నీవు అపొస్తలుల స్థానంలో పెట్టుకొని చూడు. తాను వెళ్లిపోతానని ప్రభువు వారికి చెప్పారు, కాని ఆయన ఎప్పుడు, ఎక్కడికి, ఎలా వెళ్లతారనేది వారికి తెలియనే తెలియదు. ఆ నలువది దినాల కాలంలో, (ఎప్పుడు వారితో ఉండినా) ఆయన

వారితో ఉండిన ప్రతిసారి, "ఆ సమయమిదేనా? ఆ స్థలం యిదేనా?" అని వారు ఆశ్చర్యపోతూ ఉండవచ్చు. ఏదియెలాగున్నా, చివరికి, ఆయన పరలోకానికి ఆరోహణ మైనప్పుడు, వారికి యిక ఏ సందేహం లేదు. ఆయన వెళ్లిపోయారు, నిజంగానే వెళ్లిపోయారు[20] ఇకమీదట బాధ్యత వారిమీద పడింది.

దీనికి సంబంధించిన పోలికలు గుర్తుకు వస్తున్నాయి. వాటిలో ఒకటి ప్రకృతి నుండి: "రెక్కలువచ్చిన పిల్లలను పక్షి, మీరు సొంతగా బ్రదకడానికి యిది సమయము" అన్నట్టు తన గూటిలోనుండి బయటికి పంపిన చందముగా యిది ఉంది! మరొకటి సంఘ జీవితంలోనుండి: "నేను యికను యింటికి వెళ్లాలి; యిప్పటినుండి సంఘము యొక్క పని మీ మీదనే ఉంది" అని స్థానిక సంఘానికి తెలిపిన మిషినెరీలా ఆరోహణముంది!

## పరిశుద్ధాత్మను అనుగ్రహించాడు

అపొస్తులులపై అధికమైన భారం పడినట్టు ఆరోహణం ప్రకటించడం మాత్రమే గాక, తమ బాధ్యతను నెరవేర్చడానికి గాను దైవికమైన సహాయం పొందవలసిన అవసరత కూడ అది సూచించింది. నేను వెళ్లిపోవుట మీకు ప్రయోజనకరము అని ప్రభువు వారితో చెప్పిన తరువాత, "నేను, వెళ్లనియెడల ఆదరణకర్త మీయొద్దకు రాడు" అని ఆయన తేల్చిచెప్పారు (యోహాను 16:7బి). "ఆదరణకర్త" అని ఆయన సూచించింది "పరిశుద్ధాత్మను." ఆయన పరిపాలన ఆరంభించితేనేగాని పరిశుద్ధాత్మను పంపలేరు, పైగా, దేవుని కుడి పార్శ్వమునకు హెచ్చింపబడితేనే గాని ఆయన క్రీస్తు మహిమలోనికి హెచ్చింపబడితేనే గాని ఆయన ఏలుబడి చేయలేడు. "నేను వెళ్లినయెడల నేను ఆయనను మీయొద్దకు పంపుదు"నని ఆయన తేటపరచారు (యోహాను 16:7సి). ఆయన, అనగా, "సత్య స్వరూపియైన ఆత్మవచ్చినప్పుడు, ఆయన మిమ్మును సర్వ సత్యములోనికి నడిపించును" (యోహాను 16:13ఎ).

ఆయన ఆరోహణం కాబోయేదానికి ముందు, "ఇదిగో నా తండ్రి వాగ్దానము చేసినది మీ మీదికి పంపుచున్నాను; మీరు పైనుండి శక్తిపొందువరకు పట్టణములో నిలిచియుండు డని వారితో చెప్పెను" (లూకా 24:49). వారు అపార్థం చేసికొనకుండడానికి ఈ ఏర్పాటా? ఆయన యింకను యిలా అన్నారు: "అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తి నొందెదరు" (అపొ. 1:8ఎ). వారు యెరూషలేములో రమారమి 10 దినములు వేచియున్నారు. అప్పుడు, యూదుల పెంతెకొస్తు అను పండుగ దినాన, శక్తితో పరిశుద్ధాత్మ వారి మీదికి దిగివచ్చాడు:

> పెంతెకొస్తను పండుగదినము వచ్చినప్పుడు అందరు ఒకచోట కూడియుండిరి. అప్పుడు వేగముగా వీచు బలమైన గాలివంటి యొక ధ్వని ఆకాశమునుండి అకస్మాత్తుగా, వారు కూడియున్న యిల్లంతయు నిండెను. మరియు అగ్నిజ్వాలలవంటి నాలుకలు విభాగింపబడినట్టుగా వారికి కనబడి, వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగా అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్‌శక్తి అనుగ్రహించినకొలది అన్యభాషలతో మాటలాడసాగిరి (అపొ. 2:1-4).

ముందుగా గమనించినట్టే, యేసు రాజుగా అభిషేకింపబడ్డారని రుజువు చేయడానికి పేతురు ఆనాటి అత్భుతమైన సంభవాలను ఉపయోగించుకున్నాడు: “కాగా ఆయన దేవుని కుడిపార్శ్వమునకు హెచ్చింపబడి, పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానమును తండ్రివలన పొంది, మీరు చూచుచు వినుచున్న దీనిని కుమ్మరించియున్నాడు” (అపొ. 2:33). సంఘటనల క్రమాన్ని గమనించు: క్రీస్తు పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానాన్ని తండ్రివలన పొందారు, అప్పుడు పరిశుద్ధాత్మను ఆయన అపొస్తలుల మీదికి పంపారు.




ప్రభువు వారికి అప్పగించిన మహా గొప్ప బాధ్యతను నెరవేర్చడానికి ఆయన అపొస్తలులను ఈ విధంగా సిద్ధపరచారు. పరిశుద్ధాత్మ యొక్క ఆధ్వర్యంలో, తొలిసారిగా పేతురు సువార్తను దాని సంపూర్ణ రూపంలో ప్రకటించాడు (అపొ. 2:14-36). వారి పాపములు క్షమింపబడునట్లు ప్రజలు ఏమి చేయాలో పరిశుద్ధాత్మ నడిపింపు క్రింద పేతురు వారికి తెలిపాడు (అపొ. 2:37, 38). మూడువేలమంది విని, విశ్వసించి, లోబడి, రక్షింపబడ్డారు (అపొ. 2:41, 47)!

ఆత్మ ప్రేరేపించిన అదే సువార్తను నేడు మనం వినవచ్చు, ఆత్మ ప్రేరేపించిన అదే సత్యాలను నమ్మవచ్చు, ఆత్మ ప్రేరేపించిన అదే ఆజ్ఞలకు లోబడవచ్చు, మరియు ఆత్మ ప్రేరేపించిన వాక్యమందు మనం చదివే ఆశీర్వాదములను పొందవచ్చు. ఇదంతయు, క్రీస్తు “మహిమలోనికి కొనిపోబడినదానికి” ప్రతిఫలంగా కలిగింది!

## ముగింపు

ఆరోహణాన్ని గూర్చి చెప్పగలిగినదంతా మనం చెప్పుకోలేదు, కాని క్రీస్తు భూనివాస జీవితానికి ముగింపులో ఆరోహణం యొక్క ఉన్నత స్థాయిని అభినందించడానికి గాను సరిపోయినంత మట్టుకు చెప్పానని నేను నిరీక్షిస్తున్నాను. యేసు నేడు పరలోకమందు దేవుని కుడిపార్శ్వమందుండి, తన సంఘమను రాజ్యాన్ని ఏలుతూ, మన పక్షముగా విజ్ఞాపనము చేస్తున్నారు. అటు క్రీస్తు ప్రభువుకు - యిటు మనకు - అత్యున్నతమైయుండే తరువాత సంభవం - ఆయన రెండవరాకడ, నమ్మకమైనవారు ఆయన ఆకాశమండలంలో కలిసికొన్నప్పుడు - యిది జరుగుతుంది. ఈ స్టడీ ముగింపుకు చేరుకున్నప్పుడు, మనలను మనమే ఈ ప్రశ్న అడుగుకోవాలి: “ఆయన రెండవ రాకడకు మనం సిద్ధంగా ఉన్నామా?”

ఆయన రాజుగా పట్టాభిషిక్తుడుకావడానికి యేసు పరలోకానికి తిరిగి వెళ్లారు. నీ హృదయంలో ఆయనను రాజుగా ప్రతిష్ఠించుకున్నావా? నీ జీవితపు ప్రభువుగా ఆయనను అంగీకరించి, వినయముతోకూడిన విధేయతతో నీ జీవితాన్ని ఆయనకు సమర్పించు కున్నావా? (మార్కు 16:15, 16; అపొ. 2:37, 38)?[21] నీవు అలా చేయకున్నట్టయితే, అది నేడైనా నీవు చేయాలని నా ప్రార్థనయైయుంది. కేవలం ఒక వ్యక్తియే విధేయత చూపినట్టయితే, ఈ పాఠాలు, ప్రసంగాలు సిద్ధపరచడంలో పడిన ప్రయాస సఫలమౌతుంది. దేవుడు ప్రతి ఒక్కరిని ఆశీర్వదించును గాక!

## నోట్సు

ఈ ప్రసంగాన్ని సిద్ధపరచడంలో చాలా మూలాలను సంప్రదించాను. అయితే నా నోట్సు ప్రాథమికంగా *The Crises of the Christ* అనే దానిలోనుండి, ఆ రచనలోని ముగింపు అధ్యాయమైన ఆరోహణంనుండి తీయబడింది.[22] ఈ ఘనత ఎవరికి చెందుతుందో వారికి ఇవ్వలేనందుకు క్షమను కోరుతాను.

దీన్ని నా తరహాలో నేను నిరూపించాను (flannelgraph ) ఈ ప్రసంగంలో topical విధానం అనుసరించబడింది.

---

సూచనలు

[1]పై విలాసము 1 తిమోతి 3:16నుండి తీయబడింది. [2]లూకా 24:39 "పునరుత్థానమైన యేసు శరీరం" అనే పాఠమును "క్రీస్తు జీవితం, 7లో" చూడు. [3]"అన్నిటికి కుదురుబాటు కాలము" అనేది యేసు అన్నిటిని చక్కగా చేస్తారు అనే దానిని సూచిస్తుంది – భౌతికంగా కాదు, ఆత్మ సంబంధముగా – ఆయన తిరిగి వచ్చినప్పుడు. అపొ. 3:21 పై "కార్య గ్రంథం, 1ని" చూడు. [4]క్రొత్త నిబంధన కాలంలో విజయాన్ని సాధించిన యోధుల ఉత్సవానికి యేసు ఆరోహణానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పోల్చడం జరిగింది. ఎఫెసీ. 4:8పై వాఖ్యానాన్ని "మృతులైన నీతిమంతులు నేరుగా పరలోకానికి వెళ్లతారా?" అనే పాఠములో చూడు. [5]ఇది కీర్తన 68:18నుండి కోట్ చేయబడింది. [6]ఈ అలంకారపు భాష అదృశ్య లోకానికి సంబంధించినది. "క్రీస్తు జీవితం, 7ను" చూడు. [7]ఈ భాషా ప్రయోగము కీర్తన. 2:9, అది మెస్సీయాకు సంబంధించిన కీర్తన. [8]యూదుల కాలం ప్రకారం, ఆయన పస్కాభోజనం చేసిననాడే (యేసు) మరణించారు. పస్కాకు పెంతెకొస్తుకు మధ్య 50 రోజులు గడిచాయి (లేవీ. 23:15, 16; ద్వితీయో. 16:9). [9]ఒలంపిక్ ఆటలు శ్రోతలకు పరిచయమున్న యెడల "పందెమును గెలుచుటయా లేక జయించినవారి ప్రక్కన నిలిచి బంగారు పథకాన్ని పుచ్చుకొనుటయా, ఏది పులకరించేదిగా ఉంటుంది?" [10]ఇంటికి తిరిగి వచ్చుటలోని ఆనందాన్ని వివరించే శ్రోతలకు తెలిసిన ఉదాహరణను ఉపయోగించు.

[11]Philip Yancey, *The Jesus I Never Knew* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1995), 226. [12]ఆ పేరేమి? ఆ వచనంలో తరువాత భాగం, ఆ పేరు "యేసు" అని సూచిస్తుంది. యేసుకు ఆ పేరు జననమందు (మత్తయి 1:21) యివ్వబడిందనేదానికి ఎవరైనా ఆక్షేపణ చేస్తే, ఆయన మరణము సమాధి, పునరుత్థానాలను ఎదురు చూచి, అప్పుడు యివ్వబడిందని వివరించు – యిప్పుడు అది వాస్తవంగానే యివ్వబడుతుంది – ఆయన విమోచనా కార్యాన్ని నెరవేర్చాడు గనుక. [13]క్రీస్తు పక్షులు ఎగిరే ఆకాశం, సూర్యచంద్రులున్న ఆకాశంగుండా వెళ్లి దేవుని నివాసమైన పరలోకాన్ని చేరుకున్నారు అనేదాన్ని అలంకార రూపంలో సూచించు విధానం. [14]ప్రకటన 5:6పై వ్యాఖ్యానాన్ని "ప్రకటన 2" చూడు. [15]ఆయన మన పాపాలను చూడకుండ విడిచిపెడతాడని కాదు, లేక అనుకోకుండ క్షమిస్తాడనియు కాదు మన పెనుగులాటను ఆయన అర్థం చేసికొని, సరియైనది చేయాలనే మన పోరాటంతో దయ

గలిగియుంటారు. [16]నాకు తెలిసినంతవరకు క్రీస్తు దేవుని కుడిపార్శ్వమున "కూర్చుండడంగాక," "నిలిచియుండడం" యిక్కడే కన్పిస్తుంది. క్రైస్తవ హతసాక్షి గౌరవాన్ని సూచిస్తున్నట్టు కొందరు తలంచుతారు. [17]పట్టాభిషేకము చేయునప్పుడు అనేకమంది ప్రజలు నూతన రాజును చూడకపోవచ్చు. అయితే రాజు పట్టాభిషేకం పొందిన తరువాత ప్రజల దగ్గరకు వచ్చి దానిని ప్రకటించడం జరుగుతుంది. అప్పుడు ప్రజలు గంతులు వేస్తూ ఆనందింతురు. ఈ రూపములోనే పేతురు యేసు రాజుగా పట్టాభిషేకము పొందాడు అనేదానిని ప్రకటించే పరలోకపు ప్రకటన పరిశుద్ధాత్మ రాకడవలన తెలియజేయబడింది. [18]దానియేలు 7లో వివరించబడిన "నాశనములేని" రాజ్యము దానియేలు 2:44లోని మెస్సీయా రాజ్యము/సంఘమును గూర్చినదై యున్నట్టుంది "దానియేలు, 1" ఆంగ్ల సంచికను చూడు. నాశనములేని సంఘము/రాజ్యమును గూర్చిన మత్తయి 16:18, 19లోని వాగ్దానం కూడ అలాంటిదైయుంది. దానియేలు 17:13, 14లపై వ్యాఖ్యానాన్ని "దానియేలు, 2" ఆంగ్ల సంచికలో చూడు. [19]యేసు "ప్రభువు" అనే సూచించే క్రొత్త నిబంధన వాఖ్యలనన్నిటిని నేను పట్టిక చేయలేను. కొన్ని ఉదహరణలు: అపొ. 2:36; రోమా 1:4; 1 కొరింథీ. 8:5, 6; యాకోబు 2:1; యూదా 4. [20]వారికేదైనా ప్రశ్న ఉంటే, "తెల్లని వస్త్రములు ధరించిన యిద్దరు" అనేదానిచే రద్దుచేయబడింది (అపొ. 1:10, 11).

[21]క్రైస్తవేతరులను బాప్తిస్మము పొందడానికి ఆహ్వానించు సమయములో అవిశ్వాసులైన క్రైస్తవులను పునరుద్ధరించుకొనుటకు ప్రోత్సహించు (అపొ. 8:22; యాకోబు 5:16). [22]G. Campbell Morgan, *The Crises of the Christ* (New York: Fleming H. Revell Co., 1936), 385-449.


క్రీస్తు ఆరోహణము
అపొ. 1:6-11; 2:1-4
పరిశుద్ధాత్మ
క్రీస్తు మహిమపరచబడుట
ప్రధాన యాజకుడుగా
రాజుగా
శిష్యుల సిద్ధపాటు
బాధ్యత మార్చబడింది
ఆత్మ అనుగ్రహింపబడ్డాడు